క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం

కాటారం: కాటారం మండల కేంద్రం మీదుగా మహదేవపూర్ వైపుగా టాటా ఏసీ ట్రాలీ ఆటోలో తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు మహదేవపూర్ వైపు జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేయగా ట్రాలీ ఆటోలో రేషన్ బియ్యం గుర్తించినట్లు తెలిపారు. ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి మండల కేంద్రానికి చెందిన శేఖర్, మహారాష్ట్రలోని సిరొంచకు చెందిన దుర్గం రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యల కోసం సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

పాఠశాల ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని మంజూర్‌నగర్‌లో నూతనగా ఏర్పాటు చేసిన గోల్డెన్ పాత్ ప్లే స్కూల్‌ను బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో మరిన్ని విద్యా సంస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా సంస్థల ఏర్పాటుతో జిల్లా మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయడానికి నేడు(గురువారం) ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రానున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాటారం: కాటారం 132 కేవి సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా నేడు(గురువారం) కాటారం సబ్ డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బియ్యం అందజేత



కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన గాందెర్ల కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు పరామర్శించి బియ్యం అందజేశారు. కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు తాటి రాజబాబు, కార్యకర్తలు తాటి రాజు, చంద్రబాబు, సీనియర్ నాయకులు కుమ్మరి నర్సింహ, సమ్మయ్య, రాజు, దుర్గారావు పాల్గొన్నారు.

చేయూత



ములుగు రూరల్: మండల పరిధిలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఆరెల్లి రవి కుమారులు జెనిటిక్ వ్యాధితో బాధపడుతుండగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్‌రావు చేయూతనందించారు. ఈ మేరకు బుధవారం లక్ష్మణ్‌రావు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ బాధితులకు 5 నెలలకు సరిపడా సుమారు రూ.45 వేల మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ రవి కుటుంబానికి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాల రాజన్న, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం



ములుగు రూరల్: బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. బుధవారం ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని బందారుపల్లి సమీపంలో గల ఇటుకబట్టీల వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయం, కార్మిక చట్టాలు, కార్మికుల హక్కులు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వామిదాస్, రాచర్ల రాజ్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

మల్హర్: పుస్తకాలు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



కాటారం: పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న ఎంపీపీ



చిట్యాల: పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా విద్యాశాఖ అధికారితో కలిసి ఎమ్మెల్యే మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ముఖ్య అతిథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రావీణ్యత గల ఉపాధ్యాయులు, సిబ్బంది, కావాలిసిన వసతులు, అన్ని వనరులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి కొడెపాక రఘుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను అన్ని రకాల అభివృద్ధి చేస్తుందని అన్నారు. అలాగే ప్రతిభవంతులైన ఉపాధ్యాయులచే చక్కటి విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మ నరేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బైరం కల్పన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాముత్తారం: ములుగుపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోట్‌బుక్స్‌లను బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, అనిల్, సక్కరాంనాయక్, రమేష్, వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి తదితరులు ఉన్నారు.

పలిమెల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలకు ఉపాధ్యాయులు ఉదయమే హాజరై పారిశుద్ధ్య పనులు చేయించి పాఠశాలలను ప్రారంభించారు. కాగా మండలంలోని అప్పాజీపేట, బూరుగ్గూడెం గ్రామాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులు లేకపోవడంతో పలిమెల, పంకెన పాఠశాలల ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించగా వారు మధ్యాహ్నం సమయంలో ఆయా పాఠశాలలను ప్రారంభించారు. అయితే పాఠశాలల ప్రారంభం రోజు మండలంలోని ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయలేదు.

మల్హర్: మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, జెడ్పీటీసీ అయిత కోమల రాజిరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాలకు రావడానికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో దూరభారాన్ని తగ్గించడానికి విద్యార్థులకు ఏఎమ్మార్ కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్క భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాటారం: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం పాఠశాలల పునఃప్రారంభంలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా సరఫరా అయిన పుస్తకాలు, యూనిఫాంలను ఎంపీపీ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్య అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కళ, జెడ్పీ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమారాణి, జయరాజు, సీనియర్ ఉపాధ్యాయులు సమ్మయ్య, షకీల్‌ఖాన్, పద్మజ, సుజాత, కవిత, శ్రీధర్, రాజు, సతీశ్, రజిత పాల్గొన్నారు.



మహాముత్తారం: పుస్తకాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

వాజేడు: మెట బోలిసాం వ్యాధితో బాధపడుతున్న ఆరు నెలల పాప వైద్యం ఖర్చుల కోసం చంద్రుపట్ల గ్రామానికి చెందిన కొందరు బుధవారం ఆర్థిక సాయం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని పెదగంగారం గ్రామానికి చెందిన ఆలం వెంకటేశ్వర్లు, కమలకు ఆరు నెలల పాప ఉంది. పాపకు మెట బోలిసాం అనే వ్యాధి వచ్చింది. వ్యాధి నయం కావడానికి ఇప్పటి వరకు వారి వద్ద ఉన్న రూ.2 లక్షలను ఖర్చు చేశారు. వ్యాధి పూర్తిగా నయం కావడానికి ఇంకా రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు అవసరం అవుతాయని వైద్యులు చెప్పడంతో డబ్బుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న చంద్రుపట్లకు చెందిన బుద్దె ప్రసాద్, ఆకుల మహేష్, ఆకుల మధు మోహన్ ద్వారా చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ దాతల సహకారంతో రూ.50,200 ఆస్పత్రికి వెళ్లి పాప తల్లిదండ్రులకు అందజేశారు. ఇంకా డబ్బులు అవసరం ఉందని దాతలు సహకరించి పాప ఆరోగ్యాన్ని నయం చేయించాలని తల్లిదండ్రులు కోరారు. సాయం చేయాలనుకునే దాతలు ఫోన్ పే నంబర్ 94918 90403కు పపించాలని కోరారు.

తరగతి గదులను ప్రారంభించాలి

చిట్యాల: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల ఆవరణంలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను త్వరితగతిన ప్రారంభించాలని ఏబీవీపీ ప్రాంత కార్య సమితి సభ్యులు వెల్పుల రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాదిక్రితం రూ.కోట్లాది నిధులతో అదనపు తరగతి గదులను నిర్మించిన ఇంత వరకు ఎందుకు ప్రారంభించడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు స్పందించి వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

వర్షాకాలంలో అప్రమత్తత అవసరం



వాజేడు: మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు

వాజేడు: ముంపు ప్రాంతాల వారు రానున్న వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వరదలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల వారి వివరాలను అందజేయాలని సూచించారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్న విప్లవ పార్టీలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎవరు కూడా సహకరించ వద్దని అన్నారు. అనంతరం మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాహన తనిఖీలను నిర్వహించారు.

వరద ముంపు గ్రామాల సందర్శన

గోవిందరావుపేట: మండల పరిదిలోని వరద ముంపు గ్రామాలను బుధవారం పస్రా ఎస్సై కమలాకర్ సందర్శించారు. వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకోని గతంలో వరద ముంపునకు గురైన ప్రాజెక్ట్ నగర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా ప్రమాదం అనిపిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు. గ్రామస్తులతో కలిసి ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఏదైనా సమాచారం ఉంటే అందులో పెట్టాలని సూచించారు. ఆయన వెంట పోలీసులు , తదితరులు ఉన్నారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: హనుమకొండ నుంచి ఉదయం 6 గంటలకు బీరెల్లి–రంగాపూర్ నడిచే ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునురుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ.. గతంలో బీరెల్లి–రంగాపూర్‌కు బస్సు రద్దు చేయడంతో ప్రయాణికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటు వాహనాల్లో వెళ్లేందుకు భయపడుతున్నారు. కలెక్టర్ స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సును పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, సింగల్ విండో డైరక్టర్ యనాల సిద్దిరెడ్డి , రంగబోయిన జగన్, మండల నాయకులు సాధు చక్రపాణి, రాజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఆదివాసీల పోరాటానికి సంపూర్ణ మద్దతు

వెంకటాపురం(కె): ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు కల్పించాలని కోరుతూ.. ఆదివాసీలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు యాసం రాజు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గొండ్వానా సంక్షేమ పరిసత్ ఆధ్వర్యంలో కొమురంభీమ్ కాలనీ ఆదివాసీలు చేస్తున్న రిలే నిరాహార దీక్ష మూడవ రోజు ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములను ప్రభుత్వం ఎలా స్వాధీనం చేసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాప్, సూర్యం, నర్సింహరావు, రాజేష్, మనోజ్ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.



దీక్షను ప్రారంభిస్తున్న యాసం రాజు

మెరుగైన వసతులు కల్పించాలి

ఏటూరునాగారం: ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి దామోదర స్వామి తెలిపారు. ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా ఆదేశాల మేరకు ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లను స్పెషల్ అధికారులు తనిఖీ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఆకుల వారి గణపురం ప్రాంతంలో గల బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఏటూరునాగారంలోని బాలుర ఆశ్రమ పాఠశాలను దామోదరస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ మెనూ రిజిష్టర్లను, విద్యార్థుల సంఖ్యను పరిశీలించారు. ప్రతిరోజు ఇచ్చే మెనూ సంబంధిత హెచ్ డబ్ల్యూఓ శ్రీలతను, మనోజ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనాశాలను విద్యార్థుల మరుగుదొడ్లను వారి కల్పించే వసతులను పరిశీలించారు. పాఠశాలలు పునః ప్రారంభమైనందున విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని మెనూ సక్రమంగా పాటించాలని ఆదేశించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన అధికారులు మూడు నెలల్లో చేపట్టిన వివిధ పనుల ప్రగతిని చదివి వినిపించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని మండల ఎంఈఓ ప్రభాకర్‌పై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలు గ్రామాల్లోని ఎంపీటీసీ సభ్యులు ఆయా గ్రామాల సమస్యలను సభ ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్ని రూ.వేల కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉందని సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకూడదన్నారు. వర్షాకాల సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని లూజు లైన్స్, వంగిన పోల్స్ లేకుండా చూడాలని అవసరమైన చోట మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని విద్యుత్ ఏఈ ప్రమోద్‌కు సూచించారు. మండలంలోని 25 గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండి మరిన్ని సేవలు అందించాలని సూచించారు. అలాగే మండలంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ నరేష్, తహసీల్దార్ సునీత, జెడ్పీటీసీ సదయ్య, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హుస్సేన్, ఎంపీఓ వీరస్వామి పాల్గొన్నారు.



ప్రగతి నివేదికలు చదువుతున్న అధికారులు

న్యాయం చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

చిట్యాల: కొంత కాలం నుంచి సాగు చేసుకుంటున్న తమ వ్యవసాయ భూములోకి వేరే వ్యక్తులు వచ్చి దౌర్జన్యం చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని.. తమ భూములను తమకే ఇప్పించి న్యాయం చేయాలని మండల కేంద్రంలోని తహసీల్దార్ ఖాజా మోహియొద్దీన్‌కు బుధవారం రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టేకుమట్ల మండలంలో ని రాఘవాపూర్ గ్రామానికి చెందిన బాధిత రైతులు రమేష్, పురాణం రాజబోసు, దామేరశెట్టి మహేందర్, కమ్మంపాటి బతుకమ్మ మాట్లాడుతూ.. చిట్యాల మండలంలోని చైన్‌పాక శివారులో 149/4, 150,151, 152 సర్వే నంబర్‌లలో గత నలబై సంవత్సరాలుగా పట్టాలు కలిగిన వ్యవసాయ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కాగా, తమ గ్రామానికి కర్క ప్రవీణ్‌రెడ్డి, తిప్పరబోయిన మనోజ్, జోన్నల శంకర్, డిలర్ రవీందర్ 16 మంది రైతులం సాగు చేసుకుంటున్న భూముల వద్దకు వచ్చి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అన్నారు. కావున పూర్తి సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

పెసా చట్టం ఏజెన్సీకి రక్షణ కవచం

వాజేడు: పెసా చట్టం 5వ షెడ్యూల్‌లోని ఏజెన్సీ ప్రాంతాలకు రక్షణ కవచమని ఏటూరునాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయలోని సమావేశం మందిరంలో ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు పెసా చట్టంపై అవగాహన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. పెసా చట్టం గ్రామ సభలను బలోపేతం చేయలన్నారు. పెసా చట్టంపై ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, మొబిలైజర్లు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఇండ్ల సమ్మయ్య, రమేష్, జగదీష్, వెంకటేష్ 17 గ్రామ పంచాయతీల మొబిలైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్

కళాశాల ఏర్పాటు ఆనందదాయకం

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం ఆనందకరంగా ఉందని ఆ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అన్నారు. కాలేజి అడ్మిషన్లు ప్రారంభకావటంతో ప్రాచారం కోసం 15 ఫ్లెక్సీలను వారు వితరణగా కాలేజి అకడమిక్ ఇన్‌చార్జ్ అమ్మిన రాజు శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము చదువుకునే రోజుల్లో జూనియర్ కాలేజి లేక సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చిందని అన్నారు. కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రామకృష్ణ, సుదర్శన్, పూజారి మల్లిఖార్జున్, ఉప్పల హరిప్రసాద్, నాగరాజు, కొండూరి ప్రసాద్, సునీల్, నాగేశ్వరావు ఉన్నారు.



ఫ్లెక్సీలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కరపత్రాల ఆవిష్కరణ

మహాముత్తారం: మండలకేంద్రంలో ఈ నెల 14, 15న సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పోలం చిన్న రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ కార్యక్రమాలకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మానేటి బాపు, గుండం సన్ని, హమాలి సంఘం అధ్యక్షులు సమ్మయ్య, బన్ని తదితరులు ఉన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు